క్లుప్తంగా

తపోవనంలో ప్రత్యేక పూజలు



తపోవనం ఆశ్రమంలో ప్రదోష పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని త్రయోదశి సందర్భంగా పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు ప్రదోష పూజలు, నవగ్రహ పూజలు నిర్వహించారు. శని త్రయోదశి రోజున నవగ్రహాలకు పూజలు చేస్తే సమస్త దోషాలు తొలగిపోతాయని సరస్వతీ మహాస్వామి తెలిపారు.

నందీశ్వరునికి అభిషేకాలు

గండేపల్లి: శని త్రయోదశిని పురస్కరించుకుని తాళ్లూరులో వేంచేసిన నందీశ్వరునికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మరిడమ్మ జాతర



జాతరలో ఆకట్టుకున్న శక్తివేషాలు

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే స్థానిక మరిడమ్మ అమ్మవారి జాతర శనివారం వైభవంగా జరిగింది. లారీ యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్‌రోడ్‌ను ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతరలో గరగల నృత్యం, తీన్‌మార్ డ్యాన్సులు, శక్తివేషాలు, విచిత్ర వేషధారణ భక్తులను అలరించాయి. తొలుత అమ్మవారి ఆలయం నుంచి మెయిన్ రోడ్, బాలాజీ చౌక్, నర్సీపట్నం రోడ్, దిబ్బలపాలెం మీదుగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు



కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 8వ వార్డు సామిల్లు వీధిలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పట్టణ పరిధిలో రూ.కోట్లతో రోడ్లు, కాలవలు నిర్మించామని తెలిపారు. వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ మంతిన నాగలక్ష్మి, వారాధి జ్యోతి, కమిషనర్ ప్రసాదరాజు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తొండంగి: పెరుమాళ్లపురం పంచాయతీ లక్ష్మణుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏపీ పీజీసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ శనివారం తెలిపారు. మ్యాథ్స్‌లో తమ కాలేజీకి చెందిన కె.శ్రీలక్ష్మి రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు, టి.వరలక్ష్మి 10వ ర్యాంకు, బి.తేజనాగ జయశ్రీ 63వ ర్యాంకు సాధించగా కెమిస్ట్రీలో వై.నాగశివ శ్రీను 82వ ర్యాంకు, బీవీవీ అనంతలక్ష్మి 121వ ర్యాంకు, జి.శివాజీ 130వ ర్యాంకు సాధించారని వివరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు పి.మహాలక్ష్మినాయుడు, కె.సురేష్, వి.నారాయణరావు, ఎస్.స్వర్ణలత తదితరులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పెద్దాపురం: వర్షాకాలంలో వచ్చే వ్యాధులలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పబ్లిక్ హెల్త్ సెంటర్ వైద్యులు సాయికిరణ్, మోనంద్‌చంద్ర, శ్రీ జీవన్, హెల్త్ సెక్రటరీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యేలు పర్వత పూర్ణచంద్రప్రసాద్, జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా జగనన్న సురక్ష



గుమ్మరేగులలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



గోవిందపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

రౌతులపూడి: గ్రామాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని గుమ్మరేగుల ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సేవా దృక్పథంతో పనిచేసే వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, యెనుముల కోటిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

శంఖవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక సచివాలయం-3లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మత్స్యకారులకు దిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పథకాలు

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు పూర్తిస్థాయిలో పథకాలు అందుతాయని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో శనివారం కమిషనర్ కొండలరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు సర్టిఫికెట్లు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, కోనాల వెంకటరమణ, దిలబర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కొండపోడు భూములకు త్వరలో పట్టాలు

జగ్గంపేట: కొండపోడు భూములను సాగు చేసుకుంటున్న పేదలకు త్వరలోనే డి.పట్టాలు పంపిణీ చేయడానికి కసరత్తు చేస్తున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. మండలంలోని గోవిందపురంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని గోవిందపురం, కృష్ణాపురం, వెంగయ్యమ్మపురం తదితర గ్రామాల్లో పేదలు కొండపోడు భూములను సాగు చేసుకుంటున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. గోవిందపురంలో గిరిజనులకు కులధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. పలువురు వలంటీర్లను సత్కరించారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారి నిర్మించాలని గ్రామస్తులు కోరగా త్వరలోనే ఆ సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఉభయ గోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్ వెస్లీ పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని తేటగుంట-2 (టి.వెంకటాపురం) సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్పంచ్ అత్తి నాగరాజు సర్టిఫికెట్లు అందజేశారు. ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, పీఏసీఎస్ చైర్మన్ గుండుబిల్లి వెంకటరమణ, నాయకులు గణేషుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కేపీ మల్లవరంలో జగనన్న సురక్ష

కోటనందూరు: మండలంలోని కేపీ మల్లవరంలో సర్పంచ్ వేముల సత్యవేణి అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేముల రాజబాబు, కాకర్లపూడి వెంకట సీతారామరాజు, ఎంపీటీసీ ఎమ్మిలి పద్మ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

ప్రత్తిపాడురూరల్: మండలంలోని గజ్జనపూడి గ్రామ సచివాలయం వద్ద శనివారం సర్పంచ్ గౌనగాల అప్పలరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు అధికారులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరబాబు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



జగ్గంపేటలో మత్స్యకార లబ్ధిదారుడికి వాహనం అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కళ్లా సాయిదుర్గాప్రసాద్‌కు మత్స్యశాఖ ద్వారా రూ.20 లక్షలు ఖరీదైన మత్స్యకార ఉత్పత్తులను సరఫరా చేసే వాహనం మంజూరైంది. ఈ వాహనాన్ని శనివారం జగ్గంపేటలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చంటిబాబు లబ్ధిదారుడుకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. మత్స్యకారులకు సబ్సిడీపై చేప పిల్లలు, రవాణాకు 10 ట్యాంకులు, 10 ఆక్సిజన్ సిలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కె.హరీష్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు నోటీసులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో కొంతకాలంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్‌కు పంచాయతీ కార్యదర్శి శనివారం నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ భవన నిర్మాణం చేపట్టడంతో పాఠశాలకు నోటీసులు ఇచ్చినట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. పాఠశాల భవనాలను పరిశీలించాలని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. నూతన భవనాల నిర్మాణానికి పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- ఎస్‌ఈబీ ఏఎస్పీ ప్రేమ్ కాజల్



తుని రైల్వేస్టేషన్‌లో తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

తుని: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్‌ఈబీ ఏఎస్పీ ప్రేమ్ కాజల్ అన్నారు. తుని ఎస్‌ఈబీ స్టేషన్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం తుని రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నర్సీపట్నం బస్టాండ్ వద్ద దుకాణాలు, ముగ్గకొండ దగ్గర ఎస్‌ఈబీ స్టేషన్ కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. సారా తయారీ, విక్రయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



వెంకటాపురంలో సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాదిగ రక్షణ పోరాట సమితి అధ్యక్షుడు మోషే, మహిళలు

తుని రూరల్: మండలంలోని ఎన్.సూరవరం శివారు ఎస్ఎస్ వెంకటాపురంలో శనివారం మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ 2017లో మాదిగల కురుక్షేత్ర మహాసభల్లో పాల్గొన్న పోరాట సంఘాల నాయకులు, విద్యార్థులపై అప్పటి ప్రభుత్వం కేసులు పెట్టిందన్నారు. ఆ కేసులు కొట్టివేయాలని మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగాం సురేష్, మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు సీఎం జగన్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అసైన్డ్ భూములపై దళితులకు పూర్తి హక్కులు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో సీఎం జగన్‌కు, నియోజకవర్గంలో మంత్రి దాడిశెట్టి రాజాకు అండగా నిలుస్తామన్నారు. డీపీఎస్ మండల అధ్యక్షుడు కుందూరు ప్రేమ్‌కుమార్, కాపారపు గంగబాబు, మూర్త అప్పారావు, కోరుమిల్లి చిన అప్పారావు, కోరుమిల్లి చిన్నయ్యమ్మ, కోరుమిల్లి బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద అన్నదానం

కోటనందూరు: స్థానిక చిన్నరామాలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. శంఖవరం మండలం గొంది కొత్తపల్లికి చెందిన ఈగల బెన్నయ్య జ్ఞాపకార్థం వారి కుమార్తె, అల్లుడు చప్పా లక్ష్మీమంగతాయారు, దేవుళ్ల దంపతులు అన్నదానానికి ఆర్థిక సహాయం చేశారు.వృద్ధులు, వితంతువులు, పలువురు భక్తులు పాల్గొనిఅన్నప్రసాదం స్వీకరించారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

తొండంగి: మండలంలోని దానవాయిపేట పంచాయతీ నర్సిపేటలో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ సభ్యులు శనివారం తెలిపారు. నర్సిపేట సత్తెమ్మ తల్లి ఆలయం ఆలయం వద్ద మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకూ వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కాకినాడకు చెందిన కేపిటల్ హాస్పటల్ డాక్టర్లు రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు



జి.కొత్తపల్లి వసతి గృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గోకవరం: డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని నాలుగు ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. జి.కొత్తపల్లిలో ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంజీవయ్యనగర్ సాంఘిక సంక్షేమ వసతిగృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఎస్టీ పోస్ట్‌మెట్రిక్ గర్ల్స్, బాయ్స్ హాస్టల్స్, వీరలంకపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోనూ దోమల మందును పిచికారీ చేశారు. హెల్త్ అసిస్టెంట్లు జి.పవన్, జీవీవీ రమణ, పాల్గొన్నారు.

నేడు పంచారామ క్షేత్రంలో శాకంబరి అలంకరణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. ఏటా ఆషాఢ మాసంలో మాస శివరాత్రి రోజున అమ్మవారిని ఇలా అలంకరించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం 9.30 నిమిషాలకు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించనున్నట్టు ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారమే సుమారు 800 కిలోల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారికి అలంకరణ పనులు ప్రారంభించారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

వలంటీర్ల సేవలు ఎనలేనివి



గతంలో పింఛన్ సొమ్ముల కోసం గ్రామ పంచాయతీ చుట్టూ తిరగవలసి వచ్చేది. ప్రస్తుతం ఆ ఆ పరిస్థితి లేదు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారజామునే మా వలంటీర్ తలుపు తట్టి పింఛన్ సొమ్ములు అందిస్తున్నాడు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాడు. పథకాలకు ఇంటి వద్దే మా నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. వలంటీర్ల సేవలు ఎనలేనివి.

– బొండా నాగరాజు, పింఛన్‌దారుడు, పెద్దిపాలెం

మా కుటుంబ సభ్యుడే



వలంటీర్ మా కుటుంబ సభ్యుడిగా మారిపోయాడు. సంక్షేమ పథకాల గురించి మొట్టమొదట మాకు చెప్పేది వలంటీరే. సంక్షేమ పథకాలు, పింఛన్ సొమ్ములు మా ఇంటికే అందుతున్నాయి. ప్రస్తుత రోజుల్లో అయినవాళ్లు సైతం మేలు చేయరు. అలాంటిది వలంటీర్ ద్వారా మాకు ఎన్నో సేవలు అందుతున్నాయి. మా కుటుంబంలో ఏ కార్యక్రమం జరిగినా తప్పకుండా వలంటీర్‌ను బంధువులా పిలుస్తాం.

– గొర్ల సత్తిబాబు, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం

మా కష్టాలు తీరాయి



ప్రత్తిపాడులో గోవిందమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కృష్ణ

నా పేరు జనపాల గోవిందమ్మ. మాది ప్రత్తిపాడు. నాకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. వారందరికీ పెళ్లిళ్లు కావడంతో నాకు దూరంగా వేర్వేరు ఊళ్లలో ఉంటున్నారు. ప్రతి నెలా పింఛన్ సొమ్ము తీసుకునేందుకు కిలో మీటరు కంటే దూరంగా ఉన్న పంచాయతీకి అందుబాటులో ఉండే కూతురు అతికష్టం మీద తీసుకుని వెళ్లేది. వలంటీర్ వ్యవస్థ వచ్చాక నా కష్టాలు తీరాయి. వా వలంటీర్ కృష్ణ ప్రతి నెలా ఒకటో తారీఖునే పింఛన్ సొమ్ము ఇంటికి తీసుకుని వచ్చి ఇస్తున్నాడు. కరోనా సమయంలో మా వీధిలోకి రాకపోకలను నిలుపుదల చేశారు. ఆ సమయంలో మా ఇంటికి ఎవరూ వచ్చేవారు కాదు. వలంటీర్ కృష్ణ మాత్రం తరచూ వచ్చి మా ఆరోగ్య పరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకుని వెళ్లేవాడు. వలంటీర్ రుణం తీర్చుకోలేం.

ఉల్లాసంగా... ఉత్సాహంగా..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కిట్టీ పార్టీ నిర్వాహకులు

ఏలేశ్వరం: నిత్యం వంటింటికి పరిమితమయ్యే మహిళలు తమ పనులకు స్వస్తి పలికి రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆట పాటలతో సందడి చేశారు. స్థానిక లింగంపర్తి రోడ్‌లోని వేదిక ఫంక్షన్ హాలులో శనివారం కిట్టీ పార్టీ నిర్వహించారు. వాసవి క్లబ్, వనిత మెగా కిట్టి పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పార్టీలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాకినాడ మండలాలకు చెందిన సుమారు 450 మంది మహిళలు పాల్గొన్నారు. కిట్టి పార్టీలో వన్‌గేమ్, హౌసీ సిల్వర్, ట్రాలీహౌసీ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాటోలు సంపూర్ణ, పిరాట్ల మణి, కోశాధికారి గుర్రం మణికుమారి, పాటోలు పృథ్వీనారాయణ, పిరాట్ల రవి, గుర్రం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐప్వా మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఐప్వా రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రత్తిపాడు: దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 1 వరకూ జరిగే అఖిల భారత ప్రగతి శీలా మహిళా సంఘం (ఐప్వా) 9వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐప్వా రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగమణి కోరారు. స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఐప్వా జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐప్వా రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగమణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలపై హింస, దౌర్జనాలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బేటీ బచావో బేటీ పడావో అంటూ నినాదాలు ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహించారు. ఐప్వా జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐప్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకర రత్నకుమారి, జిల్లా కార్యదర్శి వల్లూరి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు రాజాల రత్నం, జిల్లా కమిటీ సభ్యులు పేరూరి లక్ష్మి, గొల్లపల్లి కామరాజు, మొకర సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు



సూక్ష్మ సేద్యం పరికరాల రాయితీలను వివరిస్తున్న డీఎంఐఓ వరప్రసాద్

తుని రూరల్: ప్రభుత్వం రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలను అందిస్తోందని డిస్ట్రిక్ట్ మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ (కాకినాడ) వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఓ జి.విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలకు తుంపర, బిందు సేద్యం, రాయితీ పరికరాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. సూక్ష్మ సేద్యం ప్రాధాన్యత, రిజిస్ట్రేషన్ తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఐదు ఎకరాల భూములు కలిగిన అన్నివర్గాల రైతులకు బిందు సేద్యం పరికరాలను 90 శాతం రాయితీతో అందిస్తుందన్నారు ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. తుంపర్ల సేద్యం పరికారాలను అన్ని వర్గాల రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తామన్నారు. తుని మండలంలో 150 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం పరికరాలకు అనుమతి ఉందని తెలిపారు. పరికరాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ గ్రామ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఏఓ బి.అశోక్ కుమార్, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు పాల్గొన్నారు.

అనువైన చోటే ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కాకినాడలో ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యను వివరిస్తున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: మండలంలోని సుమారు ఎనిమిది గ్రామాల్లో లబ్ధిదారులకు అనువైన చోటే ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు కోరారు. ఈ మేరకు శనివారం కాకినాడలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సమక్షంలో జరిగిన నియోజకవర్గ రివ్యూ సమావేశంలో మంత్రి సిదిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికాశుక్లా, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. గతంలో నివాస స్థలాలు కేటాయించినప్పటికీ వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు సుముఖంగా లేరన్నారు. అనుకూలమైన స్థలాలు కేటాయిస్తే నిరుపేదలకు న్యాయం చేసినట్టు అవుతుందన్నారు. ఇళ్ల స్థలాల నిమిత్తం సుమారు 23 ఎకరాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కుంచే రాజా, గండేపల్లి ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.